
కులగణనపై సీఎం ప్రకటన చారిత్రాత్మకం

» వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కుల గణనపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన చారిత్రాత్మకమైనదని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ అన్నారు. కుల గణన చేపడితే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయని అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కుల గణన చేపట్టడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలలోని నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కుల గణనకు సంబంధించి సామాజిక, ఆర్థిక డేటాను ప్రభుత్వం బహిరంగంగా విడుదల చేయాలన్నారు.



డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సిరెడ్డి, తదితరులు

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను సోమవారం ఎస్వీకేంద్రంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ యువత హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ మహనీయుల ఆదర్శాలతో ముందుకెళ్లడం అభినందనీయమని అన్నారు. యువత సన్మార్గంలో పయనించాలని, అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ యూజీసీ ప్రతిపాదించిన నూతన మార్గదర్శకాలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. యూనివర్సిటీలో బ్యాక్‌లాగ్, ఇతర ఖాళీ పోస్టుల భర్తీకి రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.డి.జావీద్, నాయకులు హష్మీబాబు, నరేష్, లెనిన్, వెంకన్న, శాంతి పాల్గొన్నారు.

కోదండరామ్‌ను అభినందించిన దివ్యాంగ ఉద్యోగ సంఘం నేతలు

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రొ. కోదండరామ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా సోమవారం దివ్యాంగ ఉద్యోగుల సంఘం నేతలు ఆయనను కలిసి అభినందించారు. సంఘం గౌరవాధ్యక్షుడు నర్సయ్య, రాష్ట్ర అధ్యక్షులు హబీబ్‌మియా, కోశాధికారి వెంకటనర్సయ్య, సంయుక్త కార్యదర్శి వేదకుమారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బొల్లం మహేందర్, శ్రీనివాసులు, పరమేష్, శ్రీనివాస్ తదితరులు కోదండరామ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. వెంకన్న, కోటిలింగం, సాంబశివరావు పాల్గొన్నారు. దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కోదండరామ్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వంతో మాట్లాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

» కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. సోమవారం చప్పల్‌బజార్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురికివాడల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డాక్టర్ మనోజ్‌రెడ్డి, పద్మజ, ఇంద్ర, సబిత, అనురాధ, బీజేపీ నాయకులు మల్లికార్జున్, వెంకటేష్, భీమ్‌రాజ్, రవియాదవ్, రమాదేవి, అంజన్న పాల్గొన్నారు.

ఇందిరాపార్కులో ఘనంగా వసంతోత్సవం

కవాడిగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కులో వసంతోత్సవం 28వ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆరు యోగా సెంటర్ల ప్రతినిధులు పాల్గొనగా ఐదు గ్రూపులు నృత్యపోటీల్లో పాల్గొన్నాయి. బి.సరోజిని రామారావు టీంకు మొదటి బహుమతి లభించింది. భారతీయ యోగా సంస్థాన్ రాష్ట్రఅధ్యక్షుడు సుధీర్ కులకర్ణి, ఎ.ఎస్.చారి, సుధాకర్‌యాదవ్, డాక్టర్ రాధారాణి బహుమతులు అందజేశారు. ఈ గ్రూపులో భారతమాతగా బి.సరోజిని రామారావు, డాక్టర్ హిప్నోపద్మాకమాకర్, పి.స్వరూపరాణి, జ్యోతిరాజా, పూర్ణకుమారి, వాణిశ్రీ, కృష్ణవేణి, సుజాత, శ్రీలత, యశోద, గీత, అనిత పాల్గొన్నారు.

నేడు అవేర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అవేర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో వైద్య శిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహేశ్వరంలోని భగవతిపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని తెలిపారు. జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ నర్సింహారెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్, రిటైర్డ్ ఐఏఎస్ పీ.కే.ఎస్.మాధవన్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

సెల్ఫీ కోసం పట్టాలపైకి..

» రైలు ఢీకొని యువకుడి మృతి

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సెల్ఫీ తీసుకోవడానికి పట్టాలపైకి వెళ్లిన ఓ యువకుడు ఎంఎంటీఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. కాచిగూడ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పురాకు చెందిన అబ్దుల్ రహమాన్ (23)ఆబిడ్స్‌లో ఆప్టికల్ షాపులో పనిచేస్తున్నాడు. యాకుత్‌పుర - ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి సెల్ఫీ తీసుకోవడానికి రైలు పట్టాల పైకి వెళ్లాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న ఎంఎంటీఎస్ రైలు రహమాన్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురు స్నేహితులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రహమాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముషీరాబాద్ కాంగ్రెస్‌కు కంచుకోట

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వేదికపై మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, తదితరులు

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి ముషీరాబాద్ నియోజకవర్గం కంచుకోట అని, ఇక్కడి నుంచి గెలిచిన టి.అంజయ్య సీఎంగా పనిచేశారని, అంజన్‌కుమార్‌యాదవ్ రెండుసార్లు ఎంపీగా చేశారని, అదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని డిప్యూటీ సీఎం, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి మల్లు భట్టి విక్రమార్క కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన ముషీరాబాద్ నియోజకవర్గం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ అంజన్‌కుమార్‌యాదవ్ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం మరవదని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్, బ్లాక్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, రావి వెంకటరెడ్డి, టీపీసీసీ నాయకులు కె.హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెల్లి అంజిరెడ్డి, గ్రేటర్ నాయకులు మధుమతి, సాల్మన్, శీలం సత్యనారాయణ, శ్రీరాములు యాదగిరి, బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, వి.డి.కృష్ణ, డివిజన్ అధ్యక్షులు తిరుమల్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, అభిషేక్ కెనడీ, భాస్కర్‌యాదవ్, జువేరి హుస్సేన్, నాయకులు అరవింద్‌యాదవ్, మేడి సురేష్, డి.భానుచందర్, ఎస్తేర్‌రాణి, మారిశెట్టి నర్సింగ్‌రావు, లింగాల శేఖర్‌గౌడ్, జి.దశరథ్, కవిత, లోకేష్‌యాదవ్, లింగంగుప్తా పాల్గొన్నారు.



మల్లు భట్టి విక్రమార్క, అంజన్‌కుమార్‌యాదవ్‌లను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పాలనలో సంపద సృష్టిస్తే బీఆర్ఎస్ విధ్వంసం చేసింది

కాంగ్రెస్ పాలనలో సంపద సృష్టిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం విధ్వంసం చేసిందని, హైదరాబాద్ అభివృద్ధికి పునాదులు వేసింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనేనని, నగరానికి కృష్ణా, గోదావరి, మంజీరా నీరు తీసుకువచ్చింది తామేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యా వైద్య రంగాన్ని అభివృద్ధి చేసినట్టు చెప్పారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఇళ్లను కూలిస్తే ఎలా..?

కూల్చివేతను అడ్డుకునేందుకు విఫలయత్నం చేసిన కార్పొరేటర్లు ...కోర్టు ఉత్తర్వుతోనే కూల్చివేత : అధికారులు



బస్తీవాసులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఫళంగా ఇళ్లను కూల్చివేస్తే ఎలాగని, ప్రత్యామ్నాయం చూపే వరకూ ఇక్కడే ఉంటామని గాంధీనగర్ డివిజన్‌లోని స్వామివివేకానందనగర్ వాసులు భీష్మించారు. సోమవారం ఉదయం బస్తీలోని 20 ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మించారనే కారణంతో కోర్టు ఉత్తర్వు మేరకు కూల్చివేసినట్లు ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, అధికారులు చెప్పారు. రెండు ఇళ్లు మాత్రం ప్రైవేట్ వ్యక్తులవని ఆపేశారు. ఇళ్ల కూల్చివేతతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, రామ్‌నగర్, ముషీరాబాద్, కవాడిగూడ కార్పొరేటర్లు రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు నవీన్‌రాజుమాదిగ, రాజశేఖర్ మాదిగ కూల్చివేతలను అడ్డుకోవడానికి యత్నించగా వారిని అరెస్టు చేసి నాంపల్లి స్టేషన్‌కు తరలించారు. ధరణి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, జీఎన్.కేశవ్ కూల్చివేతలపై ప్రశ్నిస్తుండగా పోలీసులు వారిని పంపించేశారు. ఓ దశలో బాధితుడు ఆనంద్‌రావు పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అనేక సంవత్సరాలుగా నివాసముంటున్న వారి ఇళ్లను కూల్చడం ఏమిటని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం రాత్రి గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్‌లోని బస్తీవాసులను పరామర్శించి మాట్లాడారు. కోర్టు తీర్పు పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. రాష్ట్రప్రభుత్వం బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

» మాదిగ, మాదిగ ఉప కులాల సదస్సులో వక్తలు

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించాలని, లేనిపక్షంలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ మండల, నియోజకవర్గం, జిల్లా నేతల సదస్సు జరిగింది. మేడిపాపయ్య, సంఘం గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, ప్రొఫెసర్లు కనకరత్నం, ఆడామ్, జి.మల్లేష్, మేడి రమణ, కన్వీనర్లు పులిజాల గెల్వయ్య, మంచాల యాదగిరి, నాగారం బాబు మాట్లాడారు. వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించి నిజాయితీ చాటుకోవాలన్నారు. లేనిపక్షంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మందకృష్ణ మాదిగ మాదిగజాతిని బీజేపీకి తాకట్టుపెట్టారని వారు ఆరోపించారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ సభ్యులు, జిల్లా, మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

ఓయూలో లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో

• ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


తార్నాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ భవనానికి రూ.11.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో కార్యక్రమాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. లేజర్ వెలుగుల ప్రొజెక్షన్ ద్వారా వర్సిటీ చరిత్రను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఓయూ పాత్రను, భారత స్వాతంత్య్ర సంగ్రామాన్ని సజీవంగా వివరించేవిధంగా రూపొందించారు. కాగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో 16 మిలియన్లకు పైగా రంగుల కలయికతో డీఎంఎక్స్ ప్రొటోకాల్‌ని ఉపయోగించి 600 కంటే ఎక్కువ లైట్లను పొందుపరిచారు. ఈ సందర్భంగామంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఓయూ ఆర్ట్స్ కాలేజీ బిల్డింగ్‌కు అధునాతనమైన టెక్నాలజీతో లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ప్రారంభోత్సవం సాంస్కృతిక గొప్పతనాన్ని, కళాత్మకతకు ప్రతీకగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. దేశానికి ఎంతో మంది మేధావులు, ప్రముఖులను సమాజానికి అందించిన గొప్ప చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీకి ఉందని, ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఓయూ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓయూ వీసీ డా.రవీందర్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో సాంస్కృతిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి సహకరించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లేజర్ వెలుగులు ఓయూకు కొత్త కళను తీసుకొచ్చాయని అభిప్రాయపడ్డారు. మాజీ వీసీ ప్రొఫెసర్ డీసీ రెడ్డి, తిరుపతి రావు, సినీనటుడు సాయికుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు అవకాశాలపై టీహబ్‌లో సమావేశం

రాయదుర్గం, జనవరి29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడుతుందని రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని టీహబ్‌లో నార్టిక్స్ ఎస్టోనియా, పశ్చిమ యూరప్ దేశాలకు చెందిన 12మంది ప్రతినిధుల బృందంతో కలిసి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇతర నగరాలకంటే మౌలిక సదుపాయాలు, మానవ మూలధనం వంటి అంశాల్లో ముందుకు సాగుతూ వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గత ఏడాది 20వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే ఈ ఏడాది ప్రారంభంలోనే 40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందం కుదిరిందన్నారు.

బీసీ కులగణనపై బీజేపీ వైఖరి వెల్లడించాలి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

కవాడిగూడ , జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కులగణనపై బీజేపీ ఇంతవరకు వైఖరి వెల్లడించలేదని, బీసీల పట్ల ఆ పార్టీ వివక్ష చూపుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో చేపట్టనున్న బీసీల చలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బీసీ సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు కులగణనకు మద్దతు తెలిపాయని అన్నారు. బీసీలకు రాముడు ఎంత ముఖ్యమో బీసీ కులగణన కూడా అంతే ముఖ్యమని అన్నారు. బీసీల ఓట్లడిగే నైతిక హక్కు బీజేపీ కోల్పోయిందని అన్నారు. ఫిబ్రవరి 8న పార్లమెంట్ వద్ద బీసీల ధర్నా, 9న అఖిల భారత జాతీయ ఓబీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. చలో ఢిల్లీ కార్యక్రమాల్లో బీసీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, రాష్ట్ర నాయకులు బూడిద మల్లికార్జున, పానుగంటి విజయ్, సత్తెమ్మ, మధుయాదవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అహోబిల్‌మఠ్ విద్యుత్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఏటీఐ క్యాంపస్, లైఫ్ హాస్పిటల్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆంధ్రా బ్యాంక్, సాయిబాబా ఆలయం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకు, సాయిమధురానగర్ పరిధిలోని బతుకమ్మకుంట, చెంచుబస్తీ, పోచమ్మబస్తీ ప్రాంతాల్లో 12 నుంచి 1.30 వరకు, ప్లేగ్రౌండ్ పరిధిలోని బుర్జుగల్లీ, కుమ్మరవాడి, ఎరుకలబస్తీ, గాంధీ విగ్రహం ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30 వరకు, రెడ్ బిల్డింగ్ పరిధిలోని వినాయకనగర్, ఇండియన్ పెట్రోల్‌బంక్, రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజ్, మల్లికార్జున్‌నగర్, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో 3 నుంచి 5 వరకు, సంజీవయ్యనగర్ పరిధిలోని తిలక్‌నగర్, మీసేవ, శివాలయం ప్రాంతాల్లో 4 నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. అశోక్‌నగర్ పరిధిలోని వెల్ఫేర్ సెంటర్, లైబ్రరీ, చమన్, మహావీర్ కలర్ ల్యాబ్ లైన్ ప్రాంతాల్లో 10 నుంచి 1 వరకు, తాళ్లబస్తీ, గుల్షన్‌నగర్ పరిధిలోని కవాడిగూడ, ఎస్‌బీఐ కాలనీ మెయిన్‌రోడ్, తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్, సాయిబాబా టెంపుల్, ఏసీటీసీ కాలేజ్, నాలా, సాయినగర్, ఎస్‌బీఐ కాలనీ, ఘంటసాల గ్రౌండ్, పోస్టాఫీస్, మదర్‌డైరీ మిల్క్‌బూత్, రాజరాజేశ్వరి ఆలయం ప్రాంతాల్లో 2 నుంచి 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం

» ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నవీన్‌రాజ్

ముషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానందనగర్‌లో 70 సంవత్సరాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నవీన్‌రాజ్ అన్నారు. సోమవారం స్వామి వివేకానందనగర్‌లో కూల్చిన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం భోలక్‌పూర్‌లోని ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ అధికారులు పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు పక్కా గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మారిశెట్టి నర్సింగ్‌రావు, గుండు జగదీశ్‌బాబు, తదితరులు

కాంగ్రెస్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీనియర్‌నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, గుండు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరణ సభలో టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షులు అంజన్‌కుమార్‌యాదవ్, నాయకులు గుర్రం దినేష్, సురేందర్, శీలం సత్యనారాయణ, భాను, నరేందర్, కవిత, మధుమతి, సాల్మన్, జయేందర్‌బాబు, హఫీజ్, రాజు, అభిషేక్‌కెన్నడీ, బాబ్జీ, యాదగిరిగౌడ్, శేషు, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలి

» పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

బర్కత్‌పుర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ, పీఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేయాలని తెలంగాణ కమ్యూనిటీ పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ఉక్కల డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు పేదలకు వైద్య సేవలందిస్తున్నారని, వారిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మంది ఆర్ఎంపీలు వైద్య సేవలందిస్తున్నారని వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. ఫిబ్రవరి నెలాఖరున ఆర్ఎంపీ, పీఎంపీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, సీఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవిస్తామన్నారు. సమావేశంలో ఐక్యవేదిక ఉపాధ్యక్షులు బి.సదానందం, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, శ్రీనివాస్, బాలకృష్ణ, శంకర్, ఎం.ఎ.బేగ్, ఈశ్వర్‌చారి, కె.పరమేశ్వర్, శ్రీనివాస్, జంగయ్య పాల్గొన్నారు.



విజయం సాధించిన అనిల్‌కుమార్‌ను సత్కరించిన బస్తీవాసులు

తిలక్‌నగర్ బస్తీ నూతన అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

నల్లకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా కొక్కు అనిల్‌కుమార్ విజయం సాధించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికలో అధ్యక్ష పదవికి నలుగురు పోటీపడ్డారు. 342 మంది ఓటర్లు ఉండగా 340 ఓట్లు పోలయ్యాయి. కొక్కు అనిల్‌కుమార్‌కు 152 ఓట్లు, గెడ్డం రాఘవేంద్రకు 99, పెరుమండ్ల వేణుగోపాల్‌కు 31, జెట్టి బాలకృష్ణకు 58 ఓట్లు వచ్చాయి. అనిల్‌కుమార్ 50 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తిలక్‌నగర్ బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బస్తీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో బస్తీ కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.